ప్రజాశక్తి

శనివారం 27 ఏప్రిల్ 2024 1

అనంతపురం

శ్రీ సత్యసాయి

నామినేషన్ల పరిశీలన పూర్తి

అనంతపురం కలెక్టరేట్‌లో నామినేషన్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు వినోద్‌కుమార్

హాజరైన అభ్యర్థులు

◆ ప్రశాంతంగా ముగిసిన కార్యక్రమం

◆ ముఖ్యులందరి నామినేషన్లు ఆమోదం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల ప్రక్రియ మలి ఘట్టం పూర్తయ్యింది. నామినేషన్ల పరిశీలన శుక్రవారం పూర్తయ్యింది. ఇక ఉపసంహరణ ప్రక్రియ మాత్రమే మిగులుంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజవకర్గ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. అనంతపురం జిల్లాలో మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 174 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసియున్నారు. ఇందులో 136 మందికి సంబంధించిన నామినేషన్లు ఆమోదం పొందాయి. 38 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. తిరస్కరణకు గురైన వాటిల్లో అత్యధికంగా స్వతంత్రులతోపాటు, డమ్మీగా ప్రధాన పార్టీల తరుపున వేసినవి ఉన్నాయి. ప్రధాన పార్టీలకు సంబంధించిన అభ్యర్థులందరి నామినేషన్లు ఆమోదం పొందాయి.

అనంతపురం జిల్లాలో..

రాయదుర్గం అసెంబ్లి నియోజకవర్గానికి సంబంధించి 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 14 ఆమోదం పొందాయి. మూడు తిరష్కరణకు గురయ్యాయి. ఉరవకొండలో 16 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 ఆమోదం పొందాయి. ఐదు తిరస్కరణకు గురయ్యాయి. గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గానికి 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 17 మందివి ఆమోదం పొందాయి. మూడు తిరస్కరణకు గురయ్యాయి. తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 28 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 26 ఆమోదం పొందాయి. రెండు తిరస్కరణకు గురయ్యాయి. శింగనమల నియోజకవర్గంలో 22 మంది నామినేషన్లు వేయగా 16 ఆమోదం లభించాయి. ఆరు తిరస్కరణకు గురయ్యాయి. అనంతపురం అర్బన్‌లో 28 నామినేషన్లకుగానూ 21 ఆమోదం పొందాయి. ఏడు తిరస్కరణకు గురయ్యాయి. కళ్యాణదుర్గంలో 17 మంది అభ్యర్థులు నామినేషన్లు వేస్తే 16 వాటికి ఆమోదం లభించాయి. ఒకటి తిరస్కరణకు గురైంది. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి 26 మంది నామినేషన్లు వేస్తే 15 వాటికి మాత్రమే ఆమోదం లభించగా 11 తిరస్కరణకు గురయ్యాయి. మొత్తంగా చూసినప్పుడు అనంతపురం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 136 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. 38 తిరస్కరణకు గురయ్యాయి. అనంతపురం పార్లమెంటుకు సంబంధించి మొత్తం 25 మంది నామినేషన్లు వేశారు. అందులో 21 మందికి సంబంధించిన నామినేషన్లు ఆమోదం పొందాయి. నాలుగు మాత్రం తిరస్కరణకు గురయ్యాయి.

సత్యసాయి జిల్లాలో

సత్యసాయి జిల్లాలో నామినేషన్ల పరిశీలన సజావుగా జరిగింది. ఈ జిల్లా పరిధిలో మొత్తం ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అన్నింటిలోనూ కలిపి మొత్తం 188 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 51 నామినేషన్లు తిరస్కరణకు

మిగతా 3లో

వైసిపి కార్యకర్తలకు సర్ది చెప్పి వెనక్కు పంపుతున్న పోలీసులు

తాడిపత్రిలో ఉద్రిక్తత

◆ నామినేషన్ పరిశీలన కేంద్రం వద్ద టిడిపి, వైసిపి కవ్వింపు చర్యలు

◆ పోలీసుల అప్రమత్తతతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్ దరఖాస్తుల పరిశీలన నేపథ్యంలో వైసిపి, టిడిపి కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు అప్రమత్తమై ఇరుపార్టీల నేతలకు సర్ది చెప్పి అక్కడి నుంచి పంపివేయడంతో సమస్య సర్దుమణిగింది. ఎన్నికల నియామవళిలో భాగంగా శుక్రవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం వద్ద నామినేషన్ దరఖాస్తుల పరిశీలనను అధికారులు చేపట్టారు. తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 28 నామినేషన్లు దాఖలు కాగా వాటి పరిశీలన నేపథ్యంలో దరఖాస్తుదారులు కార్యాలయంలోకి వెళ్లారు. వైసిపికి చెందిన పల్లె వినోద్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో పరిశీల కార్యక్రమానికి తనను బలపరుస్తున్న గంగులకుంట కేశవరెడ్డి, అనిల్‌యాదవ్‌తో కలిసి వెళ్లారు. వారితోపాటు ప్రభాకర్ అనే వ్యక్తి లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అనుమతించలేదు. ఆ సమయంలో అక్కడే ఉన్న టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నినాదాలు వ్యతిరేకిస్తూ

మిగతా 3లో

పట్టుచీర డబ్బు కోసం ఘర్షణ సోదరుడి హత్య

2లో..

ప్రజలకు అందుబాటులో ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎన్నికలకు సంబంధించిన ఏ సమస్య అయినా ప్రజలు తెలియజేసేందుకు అందుబాటులో ఉంటామని ఎన్నికల అబ్జర్వర్లు తెలియజేశారు. మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల సాధారణ పరిశీలకులుగా వి.అన్బుకుమార్‌ను ఎన్నికల కమిషన్ నియమించింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఈయన ఫోన్ నెంబర్‌కు 9849288783 ఫిర్యాదు చేయవచ్చు. రాప్తాడు, పెనుగొండ, ధర్మవరం నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి దీపక్ రామచంద్ర తివారీ వ్యవహరిస్తారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై తన 9849288782కు ఫోన్ నెంబర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో సాధారణ జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు ప్రజలు ఎన్నికల నియమావళి ఉల్లంఘన, శాంతి భద్రతలు, తదితర ఎన్నికలకు సంబంధించి ఏ విషయంపైన అయినా తనకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. స్వయంగా నేరుగా అభ్యర్థులు కలవవచ్చునని ఆయన తెలియజేశారు.

కారుణ్య సాయం మంజూరులో చేతివాటం..!



◆ కదిరి మున్సిపల్ అధికారుల రూటే సప'రేటు'

◆ చేయితడపందే కార్మికులకు పరిహారం ఇవ్వని పరిస్థితి

◆ నిబంధనల పేరుతో కొర్రీలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణ ప్రజా రక్షణే ధ్యేయంగా ప్రజలు నిద్రలేవకనే పార, చీపురు చేతబట్టుకుని తమ బాధ్యతలను నిర్వర్తించేందుకు వెళ్లే నిరుపేద పారిశుధ్య కార్మికులు వారంతా. నిరంతరం కాలుష్యంలో ఉంటూ, వారి ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ప్రజాసేవలో నిమగ్నం అయ్యి ఉంటారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనాలతో జీవనం సాగిస్తుంటారు. నిత్యం దుమ్మూధూళిలో పని చేసే ఈ పారిశుధ్య కార్మికులు ఎక్కువగా అనారోగ్యం పాలవుతుంటారు. కొందరు కార్మికులు ప్రాణాలను సైతం కోల్పోతుంటారు. ఇలా విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం కారుణ్య సాయం కింద ఆర్థిక చేయూతను ఇస్తుంది. ఇలా అందించే సాయంలో కూడా కదిరి మున్సిపల్ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కార్మికులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సాయాన్ని అందించడంలో కొందరు అధికారులు వారి వాటాగా కొంత డబ్బులు తీసుకున్న తర్వాతనే ఫైలును ముందుకు కదిపినట్టు సమాచారం. ఒక్కో కార్మికునితో రూ.50వేల వరకు తీసుకున్న తర్వాతనే మిగిలిన మొత్తాన్ని వారికి అందిచినట్లు తెలుస్తోంది.

కదిరి మున్సిపాల్టీ పరిధిలోని పారిశుధ్య విభాగంలో పనిచేసే పారిశుధ్య, నీటి సరఫరా కార్మికుల్లో 12 మంది గత మూడు సంవత్సరాల కాలంలో అనారోగ్య సమస్యలతో మరణించారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వం కారుణ్య సాయం కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షలు మంజూరు చేసింది. 12 మందిలో మొదటి విడతగా 7మందికి రూ.14 లక్షల సాయం ఈ ఏడాది మార్చి 30వ తేదీన మంజూరు అయ్యింది. ఈ సాయాన్ని సంబంధిత కార్మిక కుటుంబ సభ్యులకు ఇవ్వడంలో మున్సిపాల్టీలోని కొందరు ముఖ్య అధికారులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కార్మికునికి మంజూరైన రూ.2 లక్షల సాయంలో ఒక్కొక్కరి నుంచి రూ.50వేలు తీసుకుని మిగిలిన సొమ్మును కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలుస్తోంది. ఇలా ఏడుగురు కార్మికుల నుంచి రూ.3.50 లక్షల తీసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి మంజూరైన సాయాన్ని తీసుకునేందుకు ఏడుమంది కుటుంబాలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగిలేలా తిరిగారు. పలుమార్లు అధికారులను కలిసి వారి

మిగతా 3లో

పోలీసుల కవాతు

కంబదూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఇటికలపల్లి ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో డీఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా సంకల్పించామన్నారు. ఇందులో భాగంగా ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజల్లో భరోసా కల్పిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు పోకూడదని సూచించారు.

అలాగే ఎన్నికల వేళ అక్రమ మద్యం, డబ్బు, ఎన్నికల తాయిలాలు అక్రమంగా తరలించకుండా శుక్రవారం స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులో అనంతపురం రూరల్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రూరల్ సి.ఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

ఆత్మకూరు : ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ మునీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో మండలంలోని గొరిదిండ్ల, ముట్టాలలో కవాతుతోపాటు గ్రామసభలు నిర్వహించి ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కవాతు, సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బెలుగుప్ప : ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంతోపాటు తగ్గుపర్తి, వెంకటాద్రిపల్లి, శీర్పి, కోనాపురం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, బెలుగుప్ప, విడపనకల్లు, వజ్రకరూరు ఎస్ఐలు శివ, ఖాజావలి, నరేష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన కాలనీల్లో కవాతు నిర్వహించి ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బెలుగుప్ప : మండల పరిధిలోని సెక్టార్ 22 పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. బెలుగుప్ప తండా, నక్కలపల్లి, శ్రీరంగాపురం, బూదివర్తి, గుండ్లపల్లిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, ర్యాంపులు, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, సెక్టోరియల్ అధికారి సుధాకర్, రూట్ ఆఫీసర్ జగదీష్, బూత్ లెవెల్ ఆఫీసర్లు దేవేంద్ర, చంద్ర, రామ్మోహన్, హనుమంతురావు, వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన యువకులు

అనంతపురం : అనంతపురం రూరల్ పంచాయతీకి చెందిన పలువురు యువకులు శుక్రవారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నగరంలోని స్వగృహంలో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ సిఎం జగన్ పాలన నచ్చి వైసిపిలో చేరినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి విజయానికి శక్తివంచన కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో యువకులు రాజసింహ, శివప్రసాద్, మురళి, మారుతి, మహి, శ్రీరాం, రియాజ్, ఇలియాజ్, భార్గవ్, శశికాంత్, లక్ష్మణ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన

నార్పల : మండల కేంద్రంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను ఎంపిడిఒ రాముడు శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఫారంపాండ్‌ను పరిశీలించి కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి కూలీకి కనీసం రూ.300 వేతనం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. కూలీలు ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి చేరుకుని ఉపాధి హామీ సిబ్బంది ఇచ్చిన కొలతల మేరకు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

రాక్షసపాలనను సాగనంపేందుకు ఏకం కావాలి

జగన్ పాలనపై ఛార్జ్‌షీట్ విడుదల చేసిన 'కూటమి' నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు నరకం చూపిస్తూ సాగుతున్న జగన్ రాక్షస పాలనను సాగనంపేందుకు ప్రజలంతా ఏకం కావాలని ఎన్‌డిఎ కూటమి నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం అర్బన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ కార్యాలయంలో 'అరాచకపాలన అంతం.. కూటమి పంతం' 'పేరుతో జగన్ పాలనపై ఛార్జ్ షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి తన అధికారాన్ని కొనసాగించాలని మరోసారి రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒక్కచాన్స్ అంటూ అబద్దాలు చెప్పి, అసత్యాలు, అసాధ్యపు వాగ్దానాలతో ఎలా అధికారంలో వచ్చాడో అందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి తలపై రూ.10లక్షల అప్పుల భారం మోపారన్నారు. రాష్ట్రాన్ని శ్యాండ్, మైనింగ్, మద్యం మాఫియాగా మార్చేశారని ధ్వజమెత్తారు. రేపోమాపో ఇంకో అబద్దపు మేనిఫెస్టోను విడుదల చేయడానికి జగన్ రెడ్డి సిద్ధం అయ్యాడని వివరించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సొంత బాబాయ్‌ని చంపిన వాళ్లకు కొమ్ముకాస్తూ చెల్లెళ్లను రోడ్డుకు ఈడ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఛార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న ఎన్‌డిఎ కూటమి నాయకులు

ఇలాంటి వ్యక్తి ఒక్క రోజు కూడా పాలన కొనసాగించడానికి వీల్లేదన్నారు. కేంద్రం ఇచ్చిన సహకారాన్ని తీసుకోలేని అసమర్థుడు జగన్ అన్నారు. కాగా అనంతపురానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేశారని, ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇస్తే వాటిని కూడా సద్వినియోగం చేసుకోలేదన్నారు. ఇప్పటికే రూ.13 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని ముంచాడన్నారు. మళ్లీ ఇంకోసారి అబద్దాల ట్రాప్‌లో ప్రజలు పడకూడదనే ఛార్జ్‌షీట్ విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కోనారెడ్డిని కలిసిన శంకరనారాయణ

శింగనమల : ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ తరిమెల కోనారెడ్డిని వైసిపి ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోనారెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. తర్వాత తరిమెల కోనారెడ్డి మాట్లాడుతూ వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వీరాంజనేయులు, శంకరనారాయణ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రి అడ్వైజర్ బోర్డు ఛైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, తరిమెల భాస్కర్‌రెడ్డి, శివపురం పెద్దతిరుపతయ్య, ఇరువెందుల చిదంబర్‌రెడ్డి, ఎల్‌ఐసి నారాయణస్వామి, కూడేరు హరీష్, శీనా, ఆది, తదితరులు పాల్గొన్నారు.

'తోపుదుర్తి'ని మరోసారి గెలిపించాలి : నయనతారెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఒక్కసారి అవకాశమిస్తే గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతారని తోపుదుర్తి నయనతారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జయరామ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎస్‌సి కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా పేద, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గం పూర్తి ప్రశాంతంగా ఉందన్నారు. మళ్లీ అలాంటి పాలన రావాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిగా, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, వైద్యాధికారి అనికేత్ సూచించారు. శుక్రవారం ఉరవకొండ మండలంలోని పి.కొట్టాల గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడమే కాకుండా జాతీయ కీటక జనిత రోగ నియంత్రణపై కరపత్రాలు పంపిణీ చేశారు. దోమల వల్ల వ్యాపించే వ్యాధుల నుంచి కాపాడుకోవడానికి ముందు జాగ్రత్తగా సెప్టిక్ ట్యాంకు గొట్టం గ్యాస్ పైప్‌లైన్‌పైన గాజు గుడ్డ, పల్చని బట్ట చుట్టాలన్నారు. అలాగే పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొకుంట్ల పిహెచ్‌సి వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నార్పల : మండల కేంద్రంలోని చౌడమ్మ కట్ట, గవ్వల వీధి ప్రాంతాల్లో వైద్యసిబ్బంది వడదెబ్బపై శుక్రవారం అవగాహన కల్పించారు. డ్రై డే ఫ్రైడేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వడదెబ్బ నివారణ చర్యలు, ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ రాముడు పరిశీలించి వైద్యసిబ్బందికి సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం అరుణ, ఎంఎల్‌హెచ్‌పి భార్గవి, ఆశావర్కర్లు భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, నాగేంద్రమ్మ, రాజమ్మ, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీ కుట్రలకు వాలంటీర్లను బలి చేయొద్దు..

'అనంత'పై 'దగ్గుపాటి' ఫైర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కుట్రలతో ఉన్నత చదువుల చదివి ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వచ్చిన వాలంటీర్లతో బలవంతపు రాజీనామాలు, ఎన్నికల ప్రచారాలు, చేయిస్తూ వారిని బలి చేయడం అన్యాయమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎలాగూ మరో రెండు నెలల్లో మారుతుందని, నువ్వు మునిగిపోతూ యువతను నట్టేట ముంచేస్తే ఎలా అంటూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ప్రశ్నించారు. బలవంతంగా వాలంటీర్లతో రాజీనామా చేయించి నీచ రాజకీయాలకు దిగడం సరికాదన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో స్థానిక వైసిపి నాయకులు, అనంత వెంకట్రామిరెడ్డి మీద తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఓటమి తప్పదని తెలిసి వాలంటీర్ల జీవితాన్ని పణంగా పెట్టి ఓట్ల కోసం రాజకీయాలు చేయడం తగునా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. మేము, మా టిడిపి పార్టీ వాలంటీర్లకు ఎప్పటికీ వ్యతిరేకం కాదని, వాలంటీర్ వ్యవస్థను వైసిపి నాయకులు పార్టీ కోసం వాడుకోవటాన్నే మేము తప్పుబడుతున్నామని దగ్గుపాటి అన్నారు. వాలంటీర్లు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలుగు దేశం ప్రభుత్వం వస్తే మీ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలు పెంచుతుందని చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. ఎవరి ఒత్తిడికో తలొగ్గి రిజైన్ చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జులు దేవళ్ల మురళి, మారుతి కుమార్ గౌడ్, మార్కెట్ మహేష్, ముక్తియార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నూర్ మహమ్మద్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

పట్టుచీర డబ్బుల కోసం ఘర్షణ

కత్తితో దాడి చేసిన సోదరుడు
ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టుచీర డబ్బుల విషయంలో వరుసకు అన్నాదమ్ముల అయ్యే ఇద్దరి మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో కత్తితో దాడి చేయడంతో ఒకరు మరణించాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి ధర్మవరం పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని గీతానగర్‌లో నివసిస్తున్న సావిత్రి మగ్గం నేసుకుంటూ పట్టుచీరలు అమ్ముతుండేది. సావిత్రికి ఇద్దరు కుమారులు పెద్ద మణికంఠ, చిన్న మణికంఠ(23). సావిత్రి నేసిన పట్టుచీరను తన చెల్లెలు నారాయణమ్మ కుమారుడు రమేష్‌కు రూ.10వేలకు అమ్మింది. పట్టుచీర తీసుకుని పోయి చాలా రోజులైంది. అయినా డబ్బులు ఇవ్వలేదని శుక్రవారం రాత్రి సావిత్రితోపాటు పెద్ద కుమారుడు పెద్ద మణికంఠ, చిన్న కుమారుడు చిన్న మణికంఠలు ఎదురు ఇంట్లో ఉన్న చెల్లెలు నారాయణమ్మ కుమారుడు రమేష్‌ను అడిగారు. డబ్బులు ఇవ్వకపోతే ఎలాగని ప్రశ్నించారు. దీంతో వారి మధ్య మాటమాట పెరిగింది. ఈ ఘర్షణలో రమేష్ ఇంట్లోని కత్తిని తీసుకొచ్చి చిన్న మణికంఠను విచక్షణారహితంగా పొడిచాడు. అడ్డు వచ్చిన పెద్దమ్మ సావిత్రిని కూడా కత్తితో గాయపరిచాడు. పెద్ద మణికంఠ వీపుపై కూడా కత్తితో పొడిచి పారిపోయాడు. స్థానికులు గమనించి పారిపోతున్న రమేష్‌ను పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. స్థానికులు తీవ్రంగా గాయపడ్డ చిన్న మణికంఠను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రథమ చికిత్స చేస్తుండగా, చిన్న మణికంఠ మతి చెందాడు. సావిత్రి, పెద్ద మణికంఠలు స్వల్పగాయాలతో ప్రాణాపాయస్థితిలో నుంచి బయటపడ్డారు. చిన్న మణికంఠ ఆరునెలల క్రితం సుధారాణి అనే అమ్మాయిని ప్రేమవివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం సుధారాణి గర్భవతి. తన భర్త మతి చెందాడని భార్య సుధారాణి ఆసుపత్రిలో భర్త శవం వద్ద బోరున విలపిస్తోంది. సావిత్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌డిటి పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

మే 4 నుంచి 10వ తేదీ వరకు అవకాశం

ఆర్‌డిటి ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.మోహన్ మురళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

2023-2024 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం ఆర్‌డిటి సెట్ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌డిటి ఎడ్యుకేషన్ డైరెక్టర్ జి.మోహన్ మురళి తెలిపారు. శుక్రవారం ఆర్‌డిటి ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లుగా ఏడాది కూడా ఆర్‌డిటి సెట్ నిర్వహించేందుకు సంస్థ నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఏ కులానికి చెందిన విద్యార్థులైన ఆర్‌డిటి సెట్ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. ఆర్‌డిటి సంస్థలో స్పాన్సర్ నెంబర్ కలిగిన వారు ప్రయివేటు పాఠశాలలో చదివినా అర్హులన్నారు. స్టేట్ సిలబస్ విద్యార్థులు 600కు 500 మార్కులు పైబడి తెచ్చుకున్న విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా ఆర్‌డిటి ఫీల్డ్ ఆఫీస్‌లకు వెళ్లి 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బిసిలకు), 3 పాస్ ఫోటోలు తీసుకుని ఆయా ఏరియా పరిధిలోని విద్యార్థులు అందజేయాలన్నారు. ఆయా ప్రాంత ఏరియా ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీస్‌లో దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. అనంతపురం అర్బన్ పరిధిలోని విద్యార్థులు అనంతపురం ఎడ్యుకేషన్ ఆఫీస్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 4వ తేదీ నుంచి 10వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. మే 19వ తేదీన ఆర్‌డిటి సెట్ పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08554-271353, 271354 నెంబర్‌లకు సంప్రదించాలని డైరెక్టర్ కోరారు.

అనుమానంతో భార్యను చంపిన భర్త

రక్తపు మడుగులో త్రివేణి

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి రూరల్ మండల కేంద్రంలోని వెంగమ్మ చెరువు గ్రామంలో అనుమానంతో భర్త తన భార్యను నరికి చంపిన ఘటన వెలుగు చూసింది. శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈడిగ పవన్, త్రివేణి భార్యాభర్తలు. పవన్ గ్రామ వాలంటీర్‌గా పనిచేసేవాడు. ఎన్నికల నేపథ్యంలో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. భార్య త్రివేణి (25) ఇంటిలో పనిచేసుకుంటూ పిల్లలను చూసుకుంటూ ఉండేది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పవన్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నాడు చికెన్ కొట్టే కొడవలితో త్రివేణిని నరికి చంపాడు. ఈ ఘటనలో త్రివేణి అక్కడికక్కడే మరణించింది. ఈ ఘటనపై పుట్టపర్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు భైరవస్వామి గుడి సమీపంలో శుక్రవారం ఉదయం ఓ ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన ఘటనలో మహిళ మతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన చంద్రశేఖర్, ఆయన భార్య కామాక్షమ్మ(45) ద్విచక్రవాహనంలో దాదులూరుకు వెళ తుండగా రేగాటిపల్లి రోడ్డు భైరవస్వామి గుడి వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కామాక్షమ్మ తలకు తీవ్ర గాయం అయ్యి ఘటనా స్థలంలోనే మరణించారు. చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఘటపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు 2వ పట్టణ పోలీసులు తెలియజేశారు.

వాసుకి సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో నూతనంగా డాక్టర్ నందిని ఏర్పాటు చేసిన వాసుకి సంతాన సాఫల్య కేంద్రాన్ని జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ లేని విధంగా హిందూపురం పట్టణంలో వాసుకి ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వైద్యురాలు నందిత మాట్లాడుతూ మారుతున్న ఆహార అలవాట్లు ఇతర సమస్యల వల్ల వివాహం అయ్యి సంతానం కలగడం లేదు. అలాంటి వారికి పరీక్షలను నిర్వహించి, చికిత్సలను అందిస్తామన్నారు. దీంతో పాటు దీర్ఘకాలంగా సంతానం లేని వారికి, తరచూ గర్భస్రావం కలిగే వారికి వైద్య సేవలను అందిస్తామన్నారు. పురుషుల్లో వీర్య కణాల లోపం ఉన్న వారికి పరీక్షలను నిర్వహించి చికిత్స ఇస్తాం అన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని, మళ్లీ గర్భం కోసం ప్రయత్నించే వారికి చికిత్స ఇస్తాం అన్నారు. దీంతో పాటు ట్యూబ్స్ మూసుకు పోయిన వారికి, స్త్రీలలో గర్భశయం, అండాశయం, అండ వాహికలో లోపాలు ఉంటే వాటిని పరీక్షలను చేసి మంచి వైద్య సేవలను అందిస్తామన్నారు. ఈ సేవలను జిల్లా ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాసుకి సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

IN THE COURT OF THE PRL DISTRICT JUDGE ANANTAPURAMU
G.W.O.P.No. 23/2024
(In the matter of permission to appoint the Petitioner as the Guardian to the mentally ill person and for Manager of property of P. Teajaswani)

Between:
P. Rama Devi w/o P. Ramu; R/at D/No: 7/31, Gandhi Nagar, Ward No. 7, Dharmavaram, Sri sathya Sai Dist ...PETITIONER

V/s

Nil ...RESPONDANT

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయడమేమనగా పై కేసులో మానసిక వ్యాధిగ్రస్తురాలు అయిన పి.తేజేశ్వనికి గార్డియన్‌గా మరియు ఆమెకు రావలసిన 1/4 షేర్ భాగము ఆస్తిని అమ్ముటకు పై కోర్టులో అర్జీదారురాలు అయిన పి.రమాదేవి పై కోర్టులో అర్జీదాఖలు చేసియున్నారు. సదరి కేసు 02-05-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు . ఆ రోజు ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలున్నచో స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారుల పరంగా తీర్మానింతురని తెల్పడమైనది.

షెడ్యూలు

All that piece and parcel of land bearing Plot No.116 part and Plot No.117/1 Part. Admeasuring 150.00Sq.Yards or 125.41Sq.Mtrs. Out of 448Sq. Yards. Covered by Survey Nos. 30, 36/1, 40 and 41. Situated at Ward No.3 Block No.14, Chitraseema Colony-II, In Mansoorabad Village Sarroor Nagar Revenue Mandal, Rangareddy District. Within the limits of L.B. Nagar Circle, Greater Hyderabad Municipal Corporation. Registration Sub District SaroorNagar,
Bounded by:North: Plot No.114and 115, **South:** Plot No.117/1 Part, **East:** Part of Plot Nos.116 and 117/1part, **West:** 30 Feet wide Road Out of this 1/4th share.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఆర్.రామ్‌కుమార్, కె.వి.రమణ రెడ్డి, కె.నాగరాజు, జి.సి ప్రకాష్,అడ్వకేట్స్, అనంతపురం.

IN THE COURT OF THE PRL DISTRICT JUDGE ANANTAPURAMU
G.W.O.P.No. 27/2024
(In the matter of property relating to the minors 1.Yallareddy gari sai pratameswar Reddy 2.Yallareddy gari Mohan Ananta Ram Reddy)

Between:
Yallareddy gari Bheema Reddy s/o yellareddy gari Sivaramireddy, Konakondla village, Vajrakaruru Mandal. Anantapuramu Dist ...PETITIONER

And

Nil ...RESPONDANT

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ చేయడమేమనగా పై నెంబరు కేసులో మైనర్లు అయిన 1.Yallareddy gari sai pratameswar Reddy 2.Yallareddy gari Mohan Ananta Ram Reddyకు సంబంధించిన ఆస్తిని అమ్ముటకు పై కోర్టులో అర్జీదారుడు అర్జీదాఖలు చేసియున్నారు. సదరి కేసు 03-05-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు . ఆ రోజు ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలున్నచో స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారుల పరంగా తీర్మానింతురని తెల్పడమైనది.

షెడ్యూలు

Property Situated In The RD Of Anantapuramu SRD Of Uravakonda And Within The Village And Panchayat Area Limits Of Vajrakarur;
Babu Sy.No: Extent
Govt.Dry 282-D1 Ac.1.00 cents} A.C 2.00 cents or
Govt.Dry 282-D2 Ac.1.00 cents} 0.809 HS ;
Bounded by: East-Land of M.Mahammad Hussain; West-Uravakonda-Guntakal Road; North-Land of G.K.Radhakrishna and G.K.Harikrishna; South-Land of S.Lukman Hakeem;

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

A.Suresh Kumar, Advocate, Anantapur, Cell : 9440204098

మద్యం పట్టివేత

శింగనమల : మండలంలోని ఆనందరావుపేట గ్రామం శివార్లలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు 30 మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

IN THE COURT OF THE IstAddl.JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU
O.S.NO. 352/2022

Between:
Canara Bank (Rep by its authorized officer, Manager and Authorised officer, Canara Bank, Gondireddypalli Branch. Rapthadu Mandal)" ...Plaintiff

V/s

K.Jayamma ...Defendant

Notice to Defendant

To,
K.Jayamma S/o k.Nagamuni, R/at D/No:1-243, Gondireddypalli Village, Rapthadu Mandal, Anantapur Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 25-06-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

చిలమకూరి శ్రీనివాసులు, వాదిపరం వకీలు అనంతపురం, సెల్ : 9490122008

IN THE COURT OF THE IIndAddl. JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU
O.S.NO. 267/2019

Between:
S.Mahadevamma ...Plaintiff

And

C.Eshwara Reddy ...Defendant

Notice to Defendant

To,
C.Eshwara Reddy S/o C.Sambasiva Reddy, R/at D/No:6-2-393, Kovvur Nagar, Anantapur.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 01-05-2024వ తేది ఉదయం 10:30గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

K.Sreenivas Reddy, Advocate, Anantapur, Cell: 9848226646

మొదటి పేజీ తరువాయి

తాడిపత్రిలో ఉద్రిక్తత

అక్కడే ఉన్న వైసిపి కార్యకర్తలూ నినాదాలు చేశారు. ఒకరిని ఒకరు కవ్వించుకుంటూ నినాదాలు చేయడంతో పోలీసులు వెంటనే అప్రమత్తం అయ్యారు. ఇరు పార్టీల కార్యకర్తలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు. దీంతో సమస్య సర్దుమణిగింది. తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి 28 నామినేషన్లకు గాను రెండు సెట్లు రద్దు అయినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ తరఫున అస్మిత్‌రెడ్డి, వైసిపి తరఫున కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయా పార్టీల బీఫారాలు ఆమోదించుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా దరఖాస్తు చేసుకున్న తెలుగుదేశం పార్టీ జేసీ ప్రభాకర్ రెడ్డి దరఖాస్తు, వైసిపి తరఫున కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి రమాదేవి దరఖాస్తులను ఆయా పార్టీల బిఫారాలు లేని కారణంగా వీరి దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలుస్తోంది. తక్కిన 26 దరఖాస్తుల్లో ఉపసంహరణ గడువు ఆనంతరం తాడిపత్రి నియోజకవర్గం శాసనసభ బరిలో ఎంతమంది నిలిచేది తేలనుంది.

మంజూరులో చేతివాటం

కుటుంబ ఇబ్బందులను తెలియజేశారు. అయితే డబ్బులు ఇవ్వందే ఫైలు ముందుకు పంపకూడదని భావించిన మున్సిపాల్టీలోని ఓ విభాగం అధికారులు కావాలనే ఆలస్యం చేశారు. లేనిపోని నిబంధనలతో కార్మికుల కుటుంబ సభ్యులకు చుక్కలు చూపారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పరిహారం ఇవ్వాలంటే చాలా సమస్యలు ఉన్నాయని, ఆ ఇబ్బందులన్నీ తాము భరించి సాయం ఇవ్వాలంటే తమకు డబ్బులు ముట్టజెప్పాల్సిందే అంటూ అధికారులు బహిరంగంగానే బేరం మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఒక్కొక్క కార్మికునికి మంజూరైన సాయం నుంచి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కార్మిక కుటుంబ సభ్యులు వారు డిమాండ్ చేసిన మొత్తాన్ని ఇచ్చేందుకు అంగీకరించారు. అందులో భాగంగా రూ.50వేల ప్రకారం ఏడుగురికి రూ.3.50 లక్షలు చెల్లించినట్లు సమాచారం. ఈ డబ్బులు చెల్లించిన తర్వాత ఏడుగురికి కారుణ్య సాయాన్ని మున్సిపల్ అధికారులు అందించారు. ఇంకా ఐదుగురికి ఈ సాయం పంపిణీ చేయాల్సి ఉంది. ఇక కారుణ్య నియామకం కింద మృతుని ఇంట్లో ఒకరికి ఇచ్చే ఉద్యోగం కోసం కూడా పెద్ద ఎత్తునే మున్సిపల్ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

సెలవుల వేతనం ఇవ్వడానికీ చేయి తడపాల్సిందే..?!

కదిరి మున్సిపల్ పరిధిలోని కొందరు సచివాలయం ఉద్యోగులు ఇటీవల గ్రూప్-1 పరీక్షల సన్నద్ధత కోసం సెలవు పెట్టారు. గ్రూప్-1 పరీక్షలు పూర్తి చేసుకుని మళ్లీ వారు విధుల్లో చేరారు. నిబంధనల ప్రకారం వీరికి వర్తించే సెలవులను మినహాయింపుగా తీసుకుని వేతనాలు ఇవ్వాల్సి ఉంది. న్యాయబద్ధంగా వీరికి వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా మున్సిపల్ అధికారులు వారితో కూడా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. సెలవుల వేతనంలో తమకూ వాటా ఇవ్వాలంటూ ముందుగానే మాట్లాడుకుని వారి ఫైల్‌ను ముందుకు కదిపారు. పట్టణ పరిధిలోని ఓ సచివాలయ మహిళా ఉద్యోగిని ప్రసూతి సెలవుల విషయంలోనూ రూ.10వేలు తీసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇలా కదిరి మున్సిపాల్టీలో కొందరు అధికారులు ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని సంబంధిత వ్యక్తులు, ఉద్యోగులకు ఇవ్వడంలో భారీగా చేతివాటం ప్రదర్శిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందన్న వాదన బలంగా విన్పిస్తోంది.

అధికారుల కక్కుర్తి దారుణం

జిఎల్.నరసింహులు,

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు.

తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పారిశుధ్య కార్మికులు ప్రజల కోసం పని చేస్తున్నారు. ఇలాంటి కార్మికులను ఆదుకోవాల్సిన అధికారులు వారికి వచ్చిన డబ్బును కూడా కాజేయాలని చూడడం దారుణం. కార్మికులు అనారోగ్యంతో చనిపోతే వారి కుటుంబానికి అందే సాయంలో కోతలు పెట్టడం సరికాదు. కార్మికులకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

నామినేషన్ల పరిశీలన పూర్తి

గురయ్యాయి. నియోజకవర్గాల వారీగా చూస్తే హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 35 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 19 ఆమోదం లభించగా 16 తిరస్కరణకు గురయ్యాయి. కదిరి అసెంబ్లీ నియోజకవర్గానికి 28 నామినేషన్లు దాఖలవగా 20 ఆమోదం పొందాయి. ఎనిమిది తిరస్కరణకు గురయ్యాయి. పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి 39 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 25 ఆమోదం పొందాయి. 14 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి 35 నామినేషన్లు పడగా 28 ఆమోదం పొందాయి. ఏడు తిరస్కరణకు గురయ్యాయి. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 26 నామినేషన్లు దాఖలవగా 23 ఆమోదం పొంది మూడు మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గానికి 25 నామినేషన్లు దాఖలయితే 22 ఆమోదం లభించాయి. మూడు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తంగా చూసినప్పుడు 188 నామినేషన్లు ఆరు నియోజకవర్గాలకు పడ్డాయి. ఇందులో 137 ఆమోదం పొందాయి. ఇందులో ప్రధానమైన పార్టీల నుంచి తిరస్కరణకు గురైన వారు లేరు. అత్యధికంగా స్వతంత్రులు, డమ్మీలుగా నామినేషన్ పత్రాలు దాఖలు చేసినవే అధికంగానున్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
శనివారం 27
ఏప్రిల్ 2024



దేశాన్ని రక్షించుకుందాం

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - బుక్కపట్నం

దేశాన్ని రక్షించుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బుక్కపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూటమి, వైసిపి అభ్యర్థులకు ఓటేస్తే బిజెపికి వేసినట్లేనని అన్నారు. తద్వారా దేశం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం బతకాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, పట్టణ అధ్యక్షులు బ్యాల్ల అంజి,కాంగ్రెస్ నాయకులు బాషా, జౌళి బాబు, వాసుదేవ రెడ్డి, సనావుల్లా, సంతోష్ రెడ్డి, శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్

బుక్కపట్నం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : పల్లె

ప్రజాశక్తి - బుక్కపట్నం

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఓటర్లు ఈ ఎన్నికలలో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకొని టీడీపీకి ఓటు వేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవి ప్రజల తలరాతను మార్చే ఎన్నికలని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాటకారి అని ప్రజలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు పెద్దరాసు సుబ్రహ్మణ్యం, సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచి సాకే యశోద, లావణ్య గౌడ్, మాజీ ఎంపీపీ బాలు, చిన్నకృష్ణ, వెంకట రాముడు, గొర్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు,

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి

రాప్తాడు ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సాకే శంకర్

దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని రాప్తాడు అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సాకే శంకర్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల పోటీ నేపథ్యంలో బి.ఫామ్ అందుకున్న ఆయన ఎన్నికల ప్రచారం, నామినేషన్, గెలుపు దిశగా ప్రజల మద్ధతు కోరుతున్న వైఖరి, తదితర అంశాలపై ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో పంచుకున్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభిష్టం ప్రకారం పరిపాలన కొనసాగించి లౌకకతత్వాన్ని వారతస్వంగా కొనసాగిస్తూ బిన్నత్వంలో ఏకత్వంగా ఆదర్శవంతమైన పాలన అందించిందన్నారు. అట్టడుగు వర్గానికి చెందిన తన లాంటి సామాన్య కార్యకర్తకు ఎమ్మెల్యే సీటు కల్పించిన గొప్ప పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. దళిత వర్గానికి చెందిన తాను ఈ ఎన్నికల్లో గెలిస్తే బడుగు బలహీన వర్గాలు గెలిచినట్లేనని అన్నారు. తన లాంటి ఎందరినో నాయకులుగా తీర్చి దిద్ది దేశానికి, రాష్ట్రానికి సేవలు అందించే గొప్ప వేదికగా కాంగ్రెస్ నిలిచిందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ప్రజలు తనకు ఒక్క అకాశం ఇచ్చి గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు.

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రశ్న : మీ కుటుంబ నేపథ్యం

జ: రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం, ముట్టాల గ్రామంలో జన్మించాను. నాది ఎస్సీ మాదిగ సామాజికవర్గం. 5వ తరగతి వరకు ముట్టాల గ్రామంలో చదువుకున్నాను. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అనంతపురం రాజేంద్ర మున్సిపల్ హై స్కూల్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ఉండి చదివాను. ఇంటర్మీడియట్ అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో చదివాను. విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యుఐలో పని చేశాను, కొద్ది రోజులు ఏఐఎస్ఎఫ్‌లో పని చేశాను. డిగ్రీలో చదువుతున్నప్పుడే యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశాను. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా 2004 వరకు పని చేశాను. 2006 నుంచి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశాను. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, వర్కింగ్ చైర్మన్‌గా ప్రస్తుతం కొసాగుతున్నాను. నా సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, జాతీయ నాయకులు కొప్పుల రాజు, రఘువీరారెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇచ్చారు.

ప్ర : కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి ఉందా.?

జ : ఏనాటికైనా దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనే శ్రీరామ రక్ష. అనానుకూల పరిస్థితుల్లో కొన్ని సున్నితమైన సంఘటనల వల్ల రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించి ఉండొచ్చు. కానీ కాంగ్రెస్ పార్టీ లేని లోటు దేశం, రాష్ట్ర ప్రజలకు తెలుసొచ్చింది. అన్ని వర్గాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఉంటుంది. దేశంలో జాతీయ సంస్థలు ప్రభుత్వ రంగంలో ఉండాలన్నా, ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ రావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుంది. రాష్ట్ర విభజన సందర్భంగా బిజెపి ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదు. మైనార్టీలకు దేశంలో అభద్రతాభావం ఏర్పడింది. మణిపూర్ హింసాకాండ దేశాన్ని కుదిపేసింది. మహిళలు దమణకాండకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథంలో దేశానికి కాంగ్రెస్ అవసరం ఉంది. రాష్ట్రంలో కూడా రైతులు, కార్మికులు, నిరుద్యోగులు బాగుపడాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావడం అవసరం. ప్రజలు విజ్ఞులు తప్పకుండా కాంగ్రెస్‌ను ఆదరిస్తారని నమ్ముతున్నాం.

ప్ర : ఇద్దరు హేమా హేమీల ముందు గెలుస్తారా..?

జ : రాప్తాడు నియోజకవర్గం ఓసి జనరల్ అభ్యర్థులు ఎవరైనా పోటీ చేయొచ్చు. అలాంటిది దళితుడినైన నన్ను మా పార్టీ ఆశీర్వదించి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించింది. నా ప్రత్యర్థి అభ్యర్థులు ఒకరు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, మరొకరు ప్రతిపక్ష పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే. వారి ఇరువురి ప్రభుత్వాల పాలనను రాప్తాడు ప్రజలు చూశారు. వారి పాలనలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగలేదు. అధికారం, డబ్బులు వారి వద్ద ఉండొచ్చు. కాని పేదల కష్టాలు, బాధలు ఏమిటో కాంగ్రెస్ పార్టీకి బాగా తెలుసు. ఏమి చేస్తే వారు బాగుపడతారో ప్రణాళిక బద్ధంగా అమలు చేసి వారి బతుకులు మార్చే శక్తి సామర్థ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే ఉంది. మా మ్యానిఫెస్టోలో ప్రజలు, రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ఆచరణ సాధ్యమైన అంశాలను ప్రజల మందు పెట్టాం. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ పరిశ్రమల స్థాపన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. రాప్తాడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. అంగ బలం, అర్థబలం వారికి ఉండొచ్చు. ప్రజల ఆశీర్వచనాలు ఆకాంక్షలు మాకు ఉన్నాయి. నా గెలుపు ఖాయం.

రాప్తాడు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్

ప్ర : మీ గెలుపు అవకాశాలు ఏమిటి.?

జ : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోతో అద్భుతమైన కార్యక్రమాలు చేపట్టబోతున్నాం. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందంటే అమలు చేసి తీరుతుందన్న నమ్మకం ప్రజల్లో ఉంది. రైతు నిత్యం అన్యాయానికి గురవుతున్నాడు. దేశానికి రైతు రాజు. అన్నం పెట్టే అన్నదాతను ప్రభుత్వాలు కాపాడాలి. కానీ బిజెపి, టిడిపి, వైసిపి రైతులను, కార్మికులను విస్మరించాయి. అందుకే కాంగ్రెస్ కర్షకుల పక్షపాతిగా రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు నిర్ణయించింది. మహిళలకు ఆర్థిక స్వావలంబన, ఉచిత ఆర్‌టిసి బస్ సౌకర్యం, డ్వాక్రా మహిళలకు రుణసదుపాయాల పెంపుదల, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, పేద విద్యార్థులకు ఉచిత విద్యాభ్యాసం కోసం పక్కా ప్రణాళికలు వంటి అంశాలే మమ్ములను గెలిపిస్తాయి.

ప్ర : ప్రచారానికి స్పందన ఎలా ఉంది.?

జ : రాప్తాడు నియోజకవర్గంలో నేను, మా పార్టీ నాయకులు ఎక్కడికి పోయినా ఆదరణ లభిస్తోంది. అగ్రకులాలు మొదలు దళిత, గిరిజనులు, ముస్లిం, మైనార్టీలు తన అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నారు. నియోజకవర్గంలో బోయ, దళిత, గిరిజన సామాజిక వర్గం అధికంగా ఉంది. దళితుడైన నేను వారితో మమేకమయ్యే అవకాశం మెండుగా ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను నిలబెట్టింది. నేను గెలిస్తే బడుగు బలహీన వర్గాలు గెలిచినట్లే. ఎమ్మెల్యేలను కలవాలంటే ఎంత ఆర్భాటాలు ఉన్నాయో ప్రజలు చూస్తున్నారు. నన్ను ఎమ్మెల్యే గెలిస్తే నేరుగా నా ఇంటికి వచ్చి నాతో వారి సమస్యలు చెప్పి భోజనం చెసి వెళ్లే స్వేచ్ఛ ఉంటుంది. మామ, చిన్నాయన, పెద్దయ్య, అల్లుడు అనే మమకారంతో పలకరించుకునే పిలుపు, ఎమ్మెల్యేతో సంబాషించడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నేను అనుసరిస్తాను.

ప్ర : అధినాయకత్వం ప్రచారానికి వస్తుందా ..?

జ : తప్పకుండా రాష్ట్ర అధినాయకత్వం కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేసే ప్రతి నియోజకవర్గానికి వస్తుంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినేత్రి షర్మిల, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు ఎన్.రఘువీరారెడ్డి ఇతర పెద్దలు నా గెలుపు కోసం ప్రచారానికి రానున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు ఆవశ్యకతను చాటిచెప్పి ప్రజల మద్దతు కూడగట్టేందుకు సమిష్టిగా ప్రచారం చేయడానికి వస్తున్నారు. దళితుడైన నన్ను రాప్తాడు నియోజకవర్గం ప్రజలు ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా. అవకాశం ఇస్తే రాప్తాడు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చేరువ చేసి మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందిస్తాం. ఈనెల 23న నేను ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశాను. ఈ కార్యక్రమానికి వేలాది మంది స్వచ్ఛంధంగా తరలివచ్చి నాకు మద్దతు పలికారు. ఎన్నికల్లో మీ ఇంటి బిడ్డగా ఆదరించండి, గెలిచి మీ రుణం తీర్చుకుని మీ మనస్సు గెలిచి మన్నలను పొందుతాను.

నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి శంకర్, ఇండియా వేదిక నాయకులు (ఫైల్ ఫోటో)

ఎన్నికల్లో సాంకేతిక విప్లవం

ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఒకప్పుడు బ్యాలెట్ పెట్టెలే కీలకం. బ్యాలెట్ పత్రాల్లోని పార్టీ గుర్తుపై స్వస్తిక్ గుర్తు వేసి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేవారు. మారుతున్న సాంకేతికతతో ఇప్పుడు ఈవీఎం యంత్రాలు వచ్చాయి. బ్యాలెట్లతో పోలిస్తే వీటి ద్వారా ఓటేయడం వేగంగా జరగడమే కాదు.. లెక్కింపు సైతం సులభం అవుతోంది. ఇలా ఆధునిక యుగంలో ఎన్నికల ప్రక్రియలో సాంకేతికత పాత్ర కీలకంగా మారింది. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం కొత్త పరిజ్ఞానాన్ని తీసుకొస్తోంది. ఈసారి ఎన్నికల్లో సైతం సాంకేతిక సౌకర్యాలు మరిన్ని అందుబా టులో వచ్చాయి.

వెబ్ కాస్టింగ్

పోలింగ్ సజావుగా సాగుతుందా లేదా తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం వెబ్‌కాస్టింగ్‌ను తీసుకొచ్చింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమరుస్తారు. ఆ దృశ్యాలను కలెక్టరేట్ కంట్రోల్ రూంలో చూడొచ్చు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే ఆ దృశ్యాలను పరిశీలించే అవకాశం ఉంది. వెబ్‌కాస్టింగ్‌ను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

◆తనిఖీల వివరాల నమోదుకు 'ఈఎస్ఎంఎస్' యాప్

ఇవిఎం పనితీరు పరిశీలన

అప్లికేషన్లు.. అనేక ప్రయోజనాలు..!

ఈ సారి ఎన్నికల సంఘం అనేక అప్లికేషన్లను తీసుకొస్తోంది. ఓటర్లు, అభ్యర్థుల, పోలింగ్, ఫలితాల వరకు వివిధ దశల్లో భిన్న వర్గాలకు ఉపయోకరమైన ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు అనేక యాప్‌లను ప్రవేశ పెట్టింది. 'ఓటర్ పోర్టల్', ఎలకోర్ టు ఓటర్, ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్, దివ్యాంగుల కోసం పర్సన్స్ విత్ డిజేబిటీస్' యాప్, పొలిటికల్ పార్టీ రిజిస్ట్రేషన్ ట్రాకింగ్ ఆన్‌లైన్, , ఈవీఎం మేనేజ్మెంట్ సిస్టమ్, ఎంసీసీ వాయిలేషన్ పోర్టల్, ఎన్కోర్ స్క్రుటినీ అప్లికేషన్ ఇలా మొత్తంగా 20 అప్లికేషన్లను ఎన్నికల సంఘం వివిధ దశల్లో ఉపయుక్తంగా తయారుచేసింది. అభ్యర్థులు నామినేషన్లు ఆన్‌లైన్‌లో సైతం వేసే అవకాశం ఉంది. ఇలా అన్ని దశల్లో సాంకేతికత కీలక భూమిక పోషిస్తోంది..

ఎప్పటికప్పుడు సమాచారం

ఎన్నికల్లో డబ్బు, మద్యం, కానుకలు, ప్రలోభాలను కట్టడి చేసేందుకు ఎన్నికలసంఘం ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో ఈసారి కొత్తగా 'ఎలక్షన్ సీజియర్ మేనేజ్మెంట్ సిస్టం' అనే అప్లికేషను తీసుకొచ్చింది. ఎన్నికల ప్రక్రియలో తనిఖీలు చేసే అందరి అధికారుల వద్ద ఈ యాప్ ఉంటుంది. డబ్బు, మద్యం, కానుకలు, నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ అవుతున్న వస్తు వులేం పట్టుకున్నా సంబంధిత అధికారులు ఇందులో వివరాలు వెంటనే నమోదు చేయాలి. వెంటనే ఆ సమాచారం ఎన్నికల సంఘానికి చేరుతుంది. తద్వారా ప్రలోభాల కట్టడికి, పారదర్శకత సాధ్యం కావడానికి ఈ సాంకేతికతను మొదటిసారిగా ఈ ఎన్నికల్లో తీసుకొచ్చారు.

ఎం 3 ఇవిఎంలు



బ్యాలెట్ బాక్సుల స్థానంలో 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) వచ్చింది. 1982లో కేరళలో తొలిసారి దీన్ని వినియోగించారు. అప్పట్లో ఈ యంత్రాల పనితనంపై పూర్తి నమ్మకం రాకపోవడంతో ఎన్నిక చెల్లుబాటు కాలేదు. వివిధ దశల్లో పరీక్షల తర్వాత 1998 నుంచి ఈవీఎంల వాడకం క్రమంగా పెరిగింది. వీటి పనితనం, వేగాన్ని ఎప్పటికప్పుడు పెంచు తున్నారు. ఈసారి మన దగ్గర జరిగే ఎన్నికల్లో తొలి సారిగా 'ఎంక్ ఈవీఎంలను వినియోగిస్తున్నారు. గతంలో వినియోగించిన ఈవీఎంలకన్నా ఇది మరింత మెరుగ్గా పనిచేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు వాడనున్న యంత్రాల్లో కంట్రోల్ యూనిట్లోనే వివరాలు కనిపిస్తాయి. సాంకేతిక సమస్య ఉంటే కంట్రోల్ యూనిట్ తెలిసిపోవడం వల్ల ఎన్నికల ప్రక్రియ సులభతరం, వేగవంతం అవుతుంది. వీవీ ప్యాట్ సమస్య ఉన్నా ఇందులో కనిపిస్తుంది.

సామాన్యుడి చేతికి అస్త్రం

ప్రలోబాలను కట్టడి చేసేందుకు క్షేత్రస్థాయిలో ఫ్లైయింగ్ స్క్వాడ్ లాంటి తనిఖీ బృందాలు పని చేస్తాయి. కొన్ని పార్టీల వాళ్ల వారి ఖ్లుగప్పి కూడా పంపకాలు చేస్తుంటారు. ఈ క్రమంలో సామాన్య ప్రజలు సైతం డబ్బు. మద్యం, ఇతర ప్రలోభా లపై ఫిర్యాదు చేసేందుకు సి-విజిల్ యాప్‌ను తీసు కొచ్చారు. ఇది గత ఎన్నికల్లోనే ప్రవేశపెట్టారు. ఈసారి యాప్‌ను మరింత అప్డేట్ చేసి సరి కొత్తగా తీసుకువచ్చింది ఎన్నికల సంఘం. ఎవరైనా నగదు పంపిణీ చేస్తుంటే లేదా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ప్రవర్తిస్తే లైవ్ ఫొటో, వీడియో తీసి ఇందులో అప్లోడ్ చేయొచ్చు. వెంటనే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం చేరుతుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారి వద్దకు అధికారులు వచ్చి చర్యలు తీసుకుంటారు.

కేతిరెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించం

చేనేత సంఘం నాయకులు

మాట్లాడుతున్న పట్టణ చేనేత ప్రముఖులు, చేనేత వ్యాపారులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని చేనేత వ్యాపారులు, పట్టణ చేనేత ప్రముఖులు, వైసిపి చేనేత నాయకులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని వైసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేనేత వ్యాపారులు, ప్రముఖులు ఉడుముల రాము, నీలూరి ప్రకాష్, గడ్డం శ్రీనివాసులు, బండారు ఆదినారాయణ, దాసరి లక్ష్మినారాయణ, (డీఎల్), శంకర యుగంధర్, కాచర్ల అంజి మాట్లాడారు. ఎన్డీఏ అభ్యర్థిగా సత్యకుమార్ వచ్చిన నెలరోజుల్లో కొంత మంది స్వలాభం కోసం పార్టీ మారడం జరిగిందన్నారు. పార్టీలోకి చేరిన వారు స్వామి భక్తిని చాటుకునేందుకు కేతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. పార్టీ మారిన గిర్రాజు నగేష్ గత చరిత్ర తెలుసుకోవాలన్నారు. తిరుమలలో దర్శనం టిక్కెట్లు అమ్ముకునే ఆయనకు కేతిరెడ్డిని విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. మరో నాయకుడు సందా రాఘవ ఏ స్థాయి నుండి ఈ స్థాయికి వచ్చాడో ఎలా వచ్చాడో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. గతంలో కేతిరెడ్డితో లబ్ధి పొంది ఇలా పేటీఎం బ్యాచ్‌గా మారిన వారికి భవిష్యత్లో తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు.

వైసిపి బీజేపీతో అంటకాగింది వాస్తవం కాదా .? : టిడిపి

ప్రజాశక్తి - కదిరి టౌన్

తమ స్వార్థ ప్రయోజనాలు కోసం ఇన్నిరోజులు వైసిపి బీజేపీతో అంటకాగింది వాస్తం కాదా అని టీడీపీ మైనార్టీ నాయకులు బహువుద్దిన్, అక్రమ్ తదితరులు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్‌ను ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని ఆకాష్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మైనార్టీలను అన్ని రకాలుగా మోసం చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీల తడాఖా ఏమిటో చూపిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం కుల మతాలను వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్ రెచ్చగొడుతున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. కేసులు కోసం మోడీకి తొత్తులుగా వైసీపీ మారిందన్న విషయం ఆపార్టీ గుర్తుంచుకుంటే మంచిదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కదిరిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్‌ను అఖండ మెజారితో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు ఆల్ఫా ముస్తఫా, మహబూబ్ బాషా, టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్,మాజీ కౌన్సిలర్ అయూబ్. కటిక ఖాదర్ భాషా, టీడీపీ మహిళా నాయకురాలు పర్వీన్ భాను తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

బాలకృష్ణకు పూలబొకే అందజేస్తున్న సవితమ్మ

నందమూరి బాలకృష్ణను కలిసిన సవితమ్మ

సోమందేపల్లి : హిందూపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ శుక్రవారం హిందూపురం నుంచి రోడ్డు మార్గంలో పెనుకొండ మండలంలోని కియా పరిశ్రమ ఎదురుగా ఉన్న హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ బాలకృష్ణను కలిసి పూలబొకే అందజేశారు. అలాగే గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారా యణ, తదితరులు బాలయ్యను కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం బాలయ్య నెల్లూరు జిల్లాలో పర్యటనకు చాపర్‌లో బయల్దేరి వెళ్లారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

చంద్రబాబుతోనే మైనార్టీల సంక్షేమం

మాజీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం : టిడిపి అధినేత చంద్రబాబుతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం పట్టణంలో వివిధ వార్డులలో జరిగిన మైనార్టీలతో ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మైనార్టీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చారన్నారు. వాటిని వైసిపి ప్రభుత్వం కనుమరుగు చేసిందన్నారు. చివరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సబ్ ప్లాన్ నిధులు సైతం తన స్వార్థం కోసం పక్కదారికి మళ్లించారన్నారు. వైసిపి అరాచక పాలన, దౌర్జన్యాలతో ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. చంద్రబాబు దక్షిత ఉన్న నాయకుడని, ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసి అధికారం వచ్చిన వెంటనే అనేక పథకాలు తీసుకొస్తారన్నారు. మైనార్టీలతోపాటు ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించి బాలకష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్ కుమార్, టిడిపి రాష్ట్ర నాయకులు ఆర్‌ఎంఎస్.షఫీవుల్లా, టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, నాయకులు అమర్నాథ్, హిదాయతుల్లా, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : డీఎస్పీ

కళ్యాణదుర్గం : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని డీఎస్పీ బి.శ్రీనివాసులు కోరారు. డీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం కంబదూరు మండలం లోని తిమ్మాపురం, కర్తనపర్తి, మరిమాకులపల్లి గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలాగే ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో కక్షలు కార్పణ్యాలు మాని శాంతియుతంగా జీవనం సాగించాలని సూచించారు. ప్రతిఒక్కరూ రాజీ మార్గాన్ని అనుసరిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఎన్నికలకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంచి గట్టి బందోబస్తు చర్యలు చేపడతామన్నారు. డీఎస్పీతో పాటు సిఐ నాగరాజు, ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

తిమ్మాపురంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసు దిగ్బంధంలో ప్రభుత్వ కార్యాలయాలు!

ఇబ్బందుల్లో ప్రజలు.. మీడియాకు సమాచారం ఇవ్వని ఎన్నికల అధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంది. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటి స్తూనే మీడియా కు సమాచారం తెలుపవచ్చు. కానీ రాయదుర్గంలో ఎన్నికల అధికారులు నామినేషన్ల ప్రక్రియ ముగిసినప్పటికీ ఎన్నికల నిబంధనల పేరిట మీడియాకూ పూర్తి స్థాయిలో తెలపడం లేదు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల ప్రక్రియ ఉండగా అంతకుముందు, తర్వాత సమయంలో కూడా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాల యంలోకి మీడియాను అనుమతించడం లేదు. వారం రోజుల్లో ఎంతమంది అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు దాఖలు చేశారో తెలుపలేదు. కార్యాలయ ఆవరణలో మీడియా పాయింట్ ఏర్పాటు చేయా లని పాత్రికేయులు కోరగా అందుకు పై అధికారుల నుంచి అనుమతి లేదని ఆర్‌ఓ కరుణకుమారి తెలిపారు. కనీసం వాట్సప్, సోషల్ మీడియా సమూహం ద్వారానైనా నామినేషన్లకు సంబంధించిన సమాచారం తెలపాలని కోరినా అవసరమైన సమగ్ర సమాచారం సకాలంలో ఎన్నికల అధికారులు మీడియాకు తెలపలేదు. గడువు ముగిసి 24 గంటలైనా మొత్తం ఎంత మంది అభ్య ర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు దాఖలు చేశారో సమాచారం ఇవ్వలేదు. ఎన్నికల కమిషన్ ఆన్‌లైన్‌లో వివరాలు పొందు పరుస్తుండగా స్థానిక ఎన్నికల అధికారులు అవసరమైన సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎన్నికల నిబంధనల పేరిట పోలీసులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని బారికేడ్లతో దిగ్బంధం చేశారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మండల పరిషత్ కార్యాలయం, పురపాలక సంఘ కార్యాలయం, పోలీస్ స్టేషన్, వ్యవసాయ అధికారి కార్యాల యం, పెన్షనర్స్ భవన్, పెట్రోల్ బంకు, షిరిడి సాయి మందిరం, నివాస గృహాలు ఉన్నాయి. ప్రజలు నిత్యం ప్రభు త్వ కార్యాలయాలు, నివాస గృహాలు, ఆలయం, పెట్రోల్ బంకుల్లో దైనందిక వ్యవహారాలు నిర్వహిస్తూ ఉంటారు. బందోబస్తు పేరిట పోలీసులు ఈ ప్రాంతం మొత్తాన్ని దిగ్బం ధం చేయడంతో ప్రజలు ఈ ప్రాంతంలో రాకపోకలు సాగిం చేందుకు ఇబ్బంది పడుతున్నారు. కేవలం ఆయా కార్యాల యంలో పని చేసే సిబ్బందిని మాత్రమే అనుమతిస్తు న్నారు. పోలీసుల వైఖరి చూస్తే ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ ప్రాంతాన్ని పూర్తి నిషేధిత ప్రాంతంగా ఆంక్షలు అమలు చేసేలా కనిపిస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఈ విష యంలో చొరవ చూపి ఈ ప్రాంతంలో ప్రజల రాక పోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. అలాగే ఎన్నికలకు సంబంధించి అవసర మైన సమా చారాన్ని మీడియాకు అందజేసేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇతర ఎన్నికల అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని మీడియా ప్రతినిధులు కోరుతున్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మడకశిర టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. వారు శుక్రవారం మండలంలోని చందకచెర్ల, గౌడనహళ్లి, ఛత్రం, బుల్లసము ద్రం, కల్లుమర్రి, ఆర్.అనంతపురం, తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో టిడిపి నాయకులు, అభిమానులు వారికి హారతు లు పట్టి ఘన స్వాగతం పలికారు. ఎంఎస్ రాజు మాట్లాడు తూ చంద్రబాబు తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. అలాగే సూపర్‌సిక్స్, బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే అసమర్థతను వివరించి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ మనోహర్, నాయకులు రవికుమార్, నరేష్ కన్నా, నాగరాజు, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

ప్రజలకు నమస్కరిస్తున్న ఎంఎస్ రాజు, తిప్పేస్వామి, శ్రీనివాస్‌మూర్తి

ఇఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

ముగిసిన నామినేషన్ల పరిశీలన

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్ సమక్షంలో నియోజకవర్గ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్ వేసిన టిడిపి, వైసిపి, కాంగ్రెస్, బిఎస్పీ, జై బీమ్ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు, ప్రపోజర్స్ సమక్షంలో ఎన్నికల అధికారులు నామినేషన్లను పరిశీలించారు. టిడిపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కురుబ రవికుమార్ పార్టీ బీ ఫామ్ ఇవ్వక పోవడంతో 2 సెట్ల నామినేషన్లను ఇఆర్‌ఓ తిరస్కరించారు. స్వతంత్ర అభ్యర్థి హబీబ్ 2 సెట్ల నామినేషన్లు వేయగా ఒక సెట్‌ను తిరస్కరించారు. దీంతో మొత్తం 11 మంది అభ్యర్థులు 25 నామినేషన్లు దాఖలు చేయగా పరిశీలనలో 10 మంది అభ్యర్థుల 22 నామినేషన్ల ను ఇఆర్‌ఓ అంగీకరించారు. వారిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పి.నరసింహప్ప, వైసిపి తరఫున ఉషశ్రీచరణ్, టిడిపి నుంచి సవితమ్మ, బిఎస్పీ అభ్యర్థిగా ఆదినారాయణ, జైబీమ్‌పార్టీ తరఫున ఎన్.నాగరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా మహేష్, ఎ.నరసింహులు, సుగాలి గణేష్ నాయక్, ఈ.నరేంద్ర, హబీబ్‌ల నామినేషన్లను ఇఆర్‌ఓ అంగీకరించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన జగన్

వజ్రకరూరు : వైసిపి పాలనలో సిఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చి, వారి కళ్లల్లో ఆనందం నింపారని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి పేర్కొన్నారు. విడపనకల్లు మండలంలోని గడేకల్ గ్రామానికి చెందిన జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమానికి శుక్రవారం ఎంపిపి హాజరయ్యారు. ఎంపిపి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచితంగా స్థలం, ఇల్లు మంజూరు చేసి, వారి సొంతింటి కల నెరవేర్చిందని తెలిపారు. ఆమెతో పాటు భర్త వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసి ఓబులేసు, హంపయ్య, ప్రసాద్, అశోక్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ఉమాశంకర్ ఉన్నారు.

నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా

పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

వైసిపి పాలనలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సహాయ, సహకారాలతో పుట్టపర్తి నియోజకవర్గంలో రూ. 6 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచా యతీలోని ఎర్రబల్లి, చిన్నరాసి పల్లి గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. అలాగే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బోయ శాంతమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జగన్ పాలనలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిం చారన్నారు. వాలంటీర్ల ద్వారా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారన్నారు. పేదలు సంతోషంగా ఉండాలంటే మరోసారి జగనే సిఎం కావాలన్నారు. రాష్ట్రం కూడా సుభిక్షంగా ఉంటుందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. నాడు-నేడు కింద పాఠశాలలను ఆధునీకరణ చేపట్టామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా వైసిపి విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపిపి గాయత్రి రెడ్డెప్పరెడ్డి, జడ్పిటిసి గంగాదేవిశంకర్, సర్పంచులు గీతాబాయి, ప్రకాష్, కేశవరెడ్డి, నాయకులు వాల్మీకి శంకర్, నాగభూషణ్, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి

ప్రజలకు మేలు జరగాలంటే వైసిపిని ఆదరించాలి

వైసిపి యువనేత వై.ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే వైసిపిని మరోమారు ఆదరించాలని ఆ పార్టీ యువజన విభాగం రాయలసీయ జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన తనయుడు వై.ప్రణయ్ రెడ్డి శుక్రవారం ఉరవకొండ పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉదయం పట్టణం లోని షిర్డీసాయి నగర్, అయ్యప్పస్వామి స్ట్రీట్, తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథాకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరెడ్డిని, అనంతపురం ఎంపిగా శంకరనారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచా రంలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, ఏ ఇంటికి వెళ్లినా ఆత్మీయంగా స్వాగతం పలుకుతు న్నారన్నారు. మరోమారు జగన్ సిఎం అయితేనే పేదలకు న్యాయం జరుగుతుందని, వారి జీవితాల్లో వెలుగులు వుంటాయన్నారు. విశ్వేశ్వరరెడ్డిని గెలిపిస్తే ప్రజలు ఆశించిన అభివృద్ధి చేసి ఆదర్శవంతగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రణయ్‌రెడ్డి

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

పుట్టపర్తి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

వైసిపి పాలనలో పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి విమర్శించారు. ఆమె శుక్రవారం మండలంలోని అల్లాపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే అసమర్థతను వివరించి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె పార్థసారధిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చిన నిధులను సర్పంచుల ఖాతాల్లోకి వెళ్లకుండా జగన్ ప్రభుత్వం దారి మళ్లించి గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకుందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయ న్నారు. చంద్రబాబు హయాంలో కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమ జిల్లాకు తెచ్చారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని 193 చెరువులను నింపడమే నా తొలి ప్రధాన హామీ అన్నారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు పి.ఓబుల్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, సర్పంచి శంకర్ రెడ్డి, పి.సుధాకర్, ఆరిఫ్‌ఖాన్, డాక్టర్ జాకీర్ పాల్గొన్నారు.

పల్లె సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న పల్లె సింధూరరెడ్డి

పల్లె సమక్షంలో టిడిపిలో చేరిక

నల్లమాడ : పుట్టపర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దేకుంట శ్రీధర్‌రెడ్డి సొంత గ్రామంలో ఆ పార్టీకి ఎదురుదెబ్బ పడింది. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో శుక్రవారం మండలంలోని పాత బత్తుల పల్లి పంచాయతీ పరిధిలోని నల్లశింగయ్యగారిపల్లిలో 14 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరాయి. మాడిశెట్టి ప్రసాద్, గోపాలం నాగరాజు, హుస్సేన్ బాషా, కలాం వలి, వెంకట రమణప్ప, ఆదినారాయణ, ఫిరోజ్ ,హైదర్ వలి, మహేష్, గోపాలం హరిప్రసాద్, మస్తాన్, బాషా, హరితో పాటు పలు కుటుంబాలు టిడిపిలో చేరగా పల్లె కండువా వేసి ఆహ్వానిం చారు. చేరిన వారు మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గం తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి గాలి వీస్తోందని, పల్లె సింధూరరెడ్డి గెలవడంతో పాటు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయం అన్నారు. వైసిపి పాలనలో ఎలాంటి అబి. వృద్ధి జరగలేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రోజురోజుకు వందల సంఖ్యలో వైసిపి మద్దతుదారులు టిడిపిలో చేరుతున్నారని, అందరికీ న్యాయం చేస్తామని పల్లె తెలిపారు. జగన్ పార్టీని ఇంటికి పంపాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అందరూ సమిష్టిగా పని చేసి పల్లె సింధూరరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మెట్టుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న భార్య యశోదమ్మ

'మెట్టు'కు మద్దతుగా సతీమణి ప్రచారం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తరపున ఆయన భార్య మెట్టు యశోదమ్మ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమె శుక్రవారం పట్టణంలోని 19వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా మెట్టు గోవిందరెడ్డిని, ఎంపిగా శంకర నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆమెతో పాటు వైసిప పట్టణ కన్వీనర్ శివప్ప, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, వైస్ ఛైర్మన్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్స్, తదితరులు ఉన్నారు.

వైసిపిలో చేరిన నాగరాజు, గౌనిమేకలపల్లి నాయకులు

ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

మూడు నామినేషన్లు తిరస్కరణ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం అసెంబ్లీ స్థానానికి సంబంధించి మొత్తం 17 మంది నామినేషన్లు దాఖలు కాగా 3 నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ఎస్. కరుణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇఆర్‌ఓ కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో నామినేషన్లను పరిశీలించారు. అనంతరం ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ తరపున డి.వరలక్ష్మి, టిడిపి నుంచి కాలవ విజయలక్ష్మి, వైసిపి తరపున మెట్టు విశ్వనాథ్ నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. మొత్తం 17 మంది నామినేషన్లు వేయగా 14 నామినేషన్లు నిబంధనల మేరకు సక్రమంగా ఉన్నాయని ఇఆర్‌ఓ తెలిపారు. వారిలో ఎంబి చిన్నప్పయ్య(కాంగ్రెస్), సి.నాగరాజు (బీఎస్పీ), మెట్టు గోవిందరెడ్డి(వైసిపి), కాలవ శ్రీనివాసులు(టిడిపి), గౌని ప్రతాపరెడ్డి (బిసివై), స్వతంత్ర అభ్యర్థులు కావలి శ్రీనివాసులు, కురుబ శ్రీనివాసులు, కావలి శ్రీనివాసులు, బళ్లారి గోవింద, ఎం.గోవిందు, పగడాల గోవిందరాజులు, హరిజన రంగనాథ్, ఉండాల రామచంద్రారెడ్డి, గౌని ఊహారాణి నామినేషన్లను ఆమోదించినట్లు ఇఆర్‌ఓ తెలిపారు.

ఎన్నికల్లో కూటమికి బుద్ధి చెబుదాం

కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్

ప్రజాశక్తి-తలుపుల

వచ్చే ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల కూటమికి గట్టిగా బుద్ధి చెప్పాలని కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ ప్రజలను కోరారు. ఆయన శుక్రవారం తలుపుల మండ లంలోని ఉడు ములకుర్తి, గొల్లపల్లితండా, ఒదులపల్లె పంచాయతీల పరిధిలోని గ్రామాలోల స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఇంటింటింకీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బోయ శాంతమ్మను అత్యధిక మెజారిటీతో గెలిపించాలను ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం మక్బూల్ మీడియాతో మాట్లాడుతూ టిడిపి పాలనలో కదిరిలో చేసింది శూన్యమన్నారు. రెండు నాల్కల ధోరణి కలిగిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎంతమంది కలిసినా, ఎవరెన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలు జగన్‌వైపే ఉన్నారన్నారన్నారు. ప్రచారంలో మక్బూల్‌కు ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వజ్రభాస్కర్‌రెడ్డి, పూల శ్రీనివాసరెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, డికె బాబు, ఎంపిపి రఫీనాయక్, జడ్పీటీసీ గిరిధర్‌రెడ్డి, కన్వీనర్ ఫయాజ్, నాయకులు కులశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, సుధీర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కుర్లి శివారెడ్డి, సర్పంచులు పతినాయుడు, ఆదిశంకర, శ్రీనివాస్‌నాయక్, ఎంపిటిసి జయంతిబాయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్

ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

రొద్దం మండలం రెడ్డిపల్లి పంచాయతీలోని గౌనిమేకలపల్లి గ్రామానికి చెందిన నాగరాజుతో పాటు నాయకులు గురువారం పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ సమక్షంలో టిడిపిలో చేరిన విషయం తెలిసిందే. వారు శుక్రవారం మళ్లీ పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సమక్షంలో సొంత పార్టీ వైసిపిలోకి చేరారు. దీంతో పెనుకొండ పట్టణంలోని ఉషశ్రీచరణ్ క్యాంప్ కార్యాలయంలో నాగరాజుకు ఉషశ్రీ వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'కాలవ' సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సమక్షంలో శుక్రవారం వైసిపి, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు టిడిపిలో చేరారు. డి.హీరేహాల్ మండలంలోని మురడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపిటిసి పరమేశ్వరప్ప, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కృష్ణ ఆధ్వర్యంలో 70 ఎస్సీ కుటుంబాలు టిడిపిలో చేరగా కాలవ వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చిక్కన్న, కుమారస్వామి, గొల్లప్ప గారి హనుమంతు, సోమశేఖర్, రమేష్, కొల్లారప్ప, నరసింహ, మంజు, అంజితో పాటు 70 మంది టిడిపిలో చేరారు. అలాగే రాయదుర్గం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసిపి నేత తిప్పేస్వామి ఆధ్వర్యంలో బొజ్జన్న, వెంకటేశులు, మల్లికార్జున, రామంజితో పాటు 4 కుటుంబాలు, రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామంలో దాదాపు 30 కుటుంబాలు వైసిపిని వీడి నుంచి టిడిపిలో చేరారు. వారికి కాలవ శ్రీనివాసులు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ ఎన్నికల్లో టిడిపి విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

కాలవ సమక్షంలో టిడిపిలో చేరిన కాంగ్రెస్, వైసిపి నాయకులు

సవితమ్మ ముమ్మర ప్రచారం

సోమందేపల్లి : పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ శుక్రవారం మండలంలోని పోలేపల్లి, పెద్దబాబయ్య పల్లి, నడింపల్లి, చాలకూరు, గుడ్డంపల్లి, తదితర గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతి గ్రామంలో ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, తనను గెలిపిస్తే ఆయా సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే సూపర్‌సిక్స్, బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే అసమర్థతను వివరించి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బికె పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆమె వెంట సర్పంచి నరసింహ మూర్తి, మండల కన్వీనర్ సిద్దు లింగప్ప, వెంకటేష్, రామంజి, భానుకీర్తి, హరికృష్ణయాదవ్, బేల్దారి చంద్ర, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు టిడిపి పథకాలను వివరిస్తున్న సవితమ్మ

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

కాంగ్రెస్ పార్టీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని సిడబ్ల్యుసి మెంబర్, మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్‌తో కలిసి రొళ్ల మండలంలోని దొడ్డేరి, అల్పనపల్లి, కాకి, గొల్లహట్టి, బ్యాడిగెర, రత్నగిరి, రత్నగిరి గొల్లహట్టి, బాజయ్యపాలెం, రొళ్ల గ్రామాల్లో పర్యటించారు. ప్రచార రథంపై నుంచి రఘువీరా రెడ్డి మాట్లాడుతూ గతంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, కాంగ్రెస్ పార్టీకి మరొక అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అర్ధాంతరంగా ఆగిన హంద్రీనీవా కాలువ పనులను పూర్తి చేసి నియోజక వర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపుతామన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా ప్రతి గ్రామానికి నీటి సౌకర్యం కల్పిస్తామని, ఆర్.అనంతపురం సమీపంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగులను ఆదుకుంటామన్నారు. నిలిచిపోయిన రైల్వే పనులను పూర్తి చేయడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా సుధాకర్‌ను గెలిపిస్తే రాష్ట్రం, కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అందజేయడానికి శక్తి వంఛన లేకుండా కృషి చేస్తామన్నారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ ఎస్.గౌడప్ప, నాయకులు ఉన్నారు.

ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు

ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు అని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వజ్రకరూరు మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. తద్వారా సర్పంచులు దిష్టిబొమ్మలుగా మారారని వాపోయారు. నిధులు లేకపోవడం వల్ల పారిశుధ్య పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రత్యేకంగా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తానన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హంద్రీనీవా కాలును తీసుకొస్తే ప్రస్తుత పాలకులు ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారన్నారు. తనను ఆదరిస్తే హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులను పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం మిరప పంట సాగు చేసిన రైతులు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిట్టుబాటు ధర కల్పించే విధంగా రైతుల పక్షాన పోరాటం చేస్తానన్నారు. పది సంవత్సరాల పరిపాలనలో అటు తెలుగుదేశం, ఇటు వైసిపి ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయన్నారు. రెండు పార్టీలు కూడా కేంద్రంలో బిజెపితో స్నేహ పూర్వకంగా కొనసాగుతున్నాయన్నారు. అయినా విభజన హామీలను సాధించకుండా నిర్లక్ష్యం వహించాయన్నారు. కేంద్రం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. అంతేగాకుండా విభజన హామీలతోపాటు ప్రతి మహిళకూ రూ.లక్ష నగదు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధరలు, ప్రతి సంవత్సరం 2.20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు, కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య, రూ.4వేల పింఛన్లు, వికలాంగులకు రూ.6వేలు పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. కావున వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి, కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీకాంత్‌వర్మ, సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి

వైసిపి అభ్యర్థి వీరాంజనేయులు నామినేషన్‌కు ఆమోదం

శింగనమల : వైసిపి అభ్యర్థి వీరాంజనేయులు నామినేషన్‌ను పరిశీలన అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుక్రవారం ఆమోదించారు. దీంతో నియోజకవర్గవ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

కుట్రలు, కుతంత్రాలు 'బాబు'కు వెన్నతో పెట్టిన విద్య

వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వ, శంకరనారాయణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రజలను మోసం చేయడం, ఉపన్యాసాలతో మాయమాటలు చెప్పడంలో టిడిపి అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ విమర్శించారు. గురువారం వజ్రకరూరు మండలం పరిధిలోని చాబాల, ఛాయాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇబిసి నేస్తం, ఆరోగ్యశ్రీ, సున్నావడ్డీ, డ్వాక్రా రుణాలు, జగనన్న చేదోడు, జగనన్న తోడు, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన, పంటల బీమా, పెన్షన్ కానుకలాంటి ఎన్నో పథకాలను నేరుగా ప్రజల వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేశామని గుర్తు చేశారు. సిఎం జగన్ ఐదేళ్లలో సువర్ణ పాలన అందించారన్నారు. అలాంటి మనస్సున్న మానవతావాది జగన్‌ను మరోసారి సిఎం చేసుకోవాలన్నారు. ఇకపోతే టిడిపి అభ్యర్థి పయ్యావుల కేశవ్ 'పిట్టల దొర'లా ప్రజలను మోసం చేసేందుకు దంచుకొట్టుడు ఉపన్యాసాలు ఇస్తున్నాడని ఎద్దేవా చేశారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ ప్రజలకు ఏం చేశావో, నీ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీలకు ఎంత దోచిపెట్టావో ప్రజలకు తెలుసన్నారు. జగన్ పరిపాలనలో ఉరవకొండ నియోజకవర్గంలో రోజూ తాను ప్రజలకు అండగా ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించానన్నారు. కేశవ్ మాదిరిగా గెలిచిన తర్వాత హైదరాబాద్, విజయవాడకు పరిమితం కాలేదన్నారు. జగన్ పరిపాలనలో కేశవ్ సొంతూళ్లో రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశానన్నారు. ఎమ్మెల్యేగా పయ్యావుల ఏనాడు నియోజకవర్గ ప్రజల సమస్యలను అటు సీఎం, ఇటు మంత్రుల దృష్టికిగానీ తీసుకెళ్లలేదన్నారు. ప్రజాసమస్యలు పట్టని వ్యక్తి కావాలో.. ప్రజలు కోసం ఆలోచించే వ్యక్తి కావాలో ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ

విశ్వన్న సతీమణి భువనేశ్వరి ప్రచారం

రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలంటే వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి భువనేశ్వరి అన్నారు. శుక్రవారం విడపనకల్ మండల పరిధిలోని వేల్పుమడుగులో భువనేశ్వరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, నాయకులు హనుమంతు, భరత్‌రెడ్డి, భీమ్‌రావు, భీమిరెడ్డి, చందా చంద్రమ్మ, మహేశ్వరి, లక్ష్మిదేవి, జారుగుబండు లక్ష్మి, రమేష్, సుంకన్న, కోట తిమ్మారెడ్డి, శ్రీరాములు, తలారి రామాంజనేయులు, పెద్దన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'విశ్వ'న్న ప్రచారం

బెలుగుప్ప : మండల పరిధిలోని దుద్దేకుంట, అంకంపల్లి గ్రామాల్లో వై.విశ్వేశ్వరరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ మచ్చన్న, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆదరించండి..అభివృద్ధి చేస్తా..

వైసిపి అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు

'నిరుపేద బిడ్డను..ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆదరించండి.. అండగా ఉండి అభివృద్ధి చేసి చూపుతా..' అంటూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని కడవకల్లు, సంజీవపురం, ఓబుళాపురం, దోసలేడు, చెర్లోపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సిఎం జగనన్న చేసిన సంక్షేమాన్ని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అందించిన సంక్షేమం, అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల సంతోషాన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు సిఎం జగనన్నపై అనవసర ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ప్రజల మేలు కోరలేని టిడిపికి ఓటు వేయకూడదని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగనన్నకి ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాఘవరెడ్డి, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రామాంజల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎం.వీరాంజనేయులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరామ్

సమిష్టిగా పని చేసి

'కూటమి'ని గెలిపిద్దాం

జేసీ పవన్‌రెడ్డి, గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-పామిడి

రాబోయే ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పని చేసి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని జెసి పవన్‌రెడ్డి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో జెసి పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి పవన్ మాట్లాడుతూ తనకు ఎంపీ టికెట్ రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాను మనస్ఫూర్తిగా కూటమి అభ్యర్థులు గుమ్మనూరు జయరామ్, అంబికా లక్ష్మీనారాయణకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి ఎన్‌డిఎ అభ్యర్థులను గెలిపించుకుని సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌కుమార్‌గౌడ్, టిడిపి అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, జనసేన జిల్లా అధ్యక్షులు ఈశ్వర్, బిసి నాయకులు కమ్మూరు నాగరాజు, బిజెపి మండల అధ్యక్షులు అంజి నాయక్, జనసేన మండల అధ్యక్షులు ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

బడుగుల పార్టీ టిడిపి : పయ్యావుల

ప్రజాశక్తి-బెలుగుప్ప

పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఆవులెన్న, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో కాలువలు తవ్వడానికి వెంకటాద్రిపల్లి, ఆవులెన్న గ్రామ రైతులు భూములు ఇచ్చారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారందరికీ ఇప్పటికీ పరిహారం సొమ్ము ఇవ్వలేదన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలువలకు భూములు కోల్పోయిన రైతులకు 18శాతం వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అంతేగాకుండా వైసిపి ప్రభుత్వం చెరువులకు నీళ్లు ఇప్పించే స్థితిలో లేదన్నారు. నీటి కోసం పోరాటం చేసి ఇప్పించానని గుర్తు చేశారు. అలాగే ఎస్సీలకు సంబంధించి 27 పథకాలను రద్దు చేసిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. హంద్రీనీవా ద్వారా నియోజకవర్గంలో 75శాతం భూములకు నీరిచ్చేందుకు రూపుకల్పన చేశామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులను ఆదుకుంటామన్నారు. వీటితోపాటు ప్రతి గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తామన్నారు. గతంలో వెంకటాద్రిపల్లె మీదుగా కళ్యాణదుర్గానికి బస్సు సర్వీస్ నడిచేదని, వైసిపి వచ్చాక రద్దు చేశారన్నారు. తామొస్తే బస్సు సర్వీసును ఏర్పాటు చేస్తామన్నారు. కాగా టిడిపి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రైతులకు ఏడాదికి రూ.20వేలు, 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 అందజేస్తామన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

వజ్రకరూరు : కూడేరు మండల కేంద్రంలో టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విక్రమ్‌సింహా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్ ప్రవేశపరీక్ష

హిందూపురం : రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి నిర్వహించే పాలిసెట్-2024 (పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష) శనివారం నిర్వహిస్తున్నట్లు పాలీసెట్ కో ఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపల్ యన్.హరీశ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో మొత్తం 2129 మంది అభ్యర్థులకు గాను 5 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీ బాలాజీ విద్యవిహార్ డిగ్రీ కళాశాల, సప్తగిరి డిగ్రీ కళాశాల, బాలయేసు డిగ్రీ కళాశాల, బాలయేసు జూనియర్ కళాశాలతో ఎంజిఎం హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఒక్క నిముషం ఆలస్యం అయినా అనుమతించమని స్పష్టం చేశారు. ధరఖాస్తు చేసి హాల్ టికెట్ రాని అభ్యర్థులు పాలీసెట్ సహాయ కేంద్రం, లేదా స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఉదయం 8 గంటలకు పాలీసెట్ అప్లికేషన్‌తో వస్తే పరీక్ష రాసే సదుపాయం కల్పిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లను సెంట్రల్ అబ్జర్వర్ లక్ష్మీపతి, పాలీసెట్ సహాయక బందం తనిఖీ చేసి సూచనలు జారీ చేశారన్నారు.

జగన్ పాలనలో మైనార్టీల పథకాలు కనుమరుగు

కదిరి అర్బన్ : టిడిపి ప్రవేశపెట్టిన మైనార్టీల సంక్షేమ పథకాలను కనుమరుగు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టణంలోని 18వ వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ప్రచారంలో నాయకులు అనిల్ కుమార్ రెడ్డి, బహుద్దీన్, శ్రీకాంత్ రెడ్డి, ముస్తఫా, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

గుత్తి : గుంతకల్లులో ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. హెడ్ కానిస్టేబుల్ ఎ.లక్ష్మయ్య తెలిపిన వివరాల మేరకు.. పాత గుంతకల్లులోని వాల్మీకి కళ్యాణ మండపం ఎదురుగా నివాసం ఉండే బోయ వెంకటరాముడు భార్య హేమలత రైల్వేస్టేషన్ వద్ద ఉన్న భజరంగదళ్ పాయింట్‌లో పని చేస్తూ ఉండేది. ఈ నేపథ్యంలో కరివేపాకు తేవడానికి ఆమె ఇంటి నుంచి వాల్మీకి సర్కిల్‌కు వెళ్తుండగా సోఫియావీధికి చెందిన షేక్ బాబా ఫక్రుద్దీన్ హేమలతను నానా దుర్భాషలాడుతూ కూరగాయలు కోసే కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రి తరలించారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు గుంతకల్లు టూటౌన్ సీఐ ఎస్.అనిల్ కుమార్, ఎస్ఐ కెసి తిరుపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్ట్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథ ఆచారి నిందితుడికి ఐపీసీ 307 సెక్షన్ కింద ఏడాది పాటు జైలు శిక్ష రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

కర్నాటకలో రోడ్డు ప్రమాదం.. రైతు మృతి..

బొమ్మనహాల్ : కర్నాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందిన మిరప రైతు ఈడిగ దేవేంద్ర(39) మృతి చెందాడు. వివరాలు.. దేవేంద్ర తన పొలంలో సాగుచేసిన మిరప పంట దిగుబడిని కర్నాటకలోని బ్యాడికి మార్కెట్‌లో విక్రయించి బొలెరో వాహనంలో సొంతూరు బయల్దేరారు. మార్గమధ్యలో దావనగిరి-హిరియార్ మధ్య ప్రధాన రహదారిపై వీరి వాహనం ఆటోను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కర్నాటక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం పంపినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. దేవేంద్రకు భార్య జ్యోతి, కుమారుడు ప్రదీప్, కుమార్తె ప్రణతి ఉన్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. రైతు మృతితో హరేసముద్రం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ బస్సు బోల్తా.. పది మందికి గాయాలు

కళ్యాణదుర్గం : మండలంలోని మల్లికార్జునపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి కళ్యాణదుర్గం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు బళ్లారి నుంచి కళ్యాణదుర్గం వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో సుమారు 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులను వెలికి తీసే ప్రయత్నం చేశారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎవరి పల్లకి మోస్తున్నారు..?

చేనేతపై కనీస అవగాహన లేని వారికి మద్దతు సరికాదు.. కాంగ్రెస్ అభ్యర్థి రంగన అశ్వర్థనారాయణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మూడు నెలల క్రితం వరకు ఎన్నికల్లో ఎవరి పల్లికీ మోయమని తామే పల్లికి ఎక్కుతామనేలా మాట్లాడి ఇప్పుడు ఎక్కడి నుంచో వచ్చిన స్థానికేతరుడికి మద్దతు తెలిపేలా చేనేత నాయకులు మాట్లాడడం అత్యంత దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి రంగన అశ్వర్థ నారాయణ తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు నెలల క్రితం చేనేతలంతా సమావేశమై చేనేతలు ఐక్యంగా ఉంటామని ఎవరి పల్లకి మోయమని చెప్పిన నాయకులు ఎన్నికలు రాగానే ఎన్డీఏ అభ్యర్థి పల్లికి మోసేందుకు ఎందుకు సిద్ధం అయ్యారని ప్రశ్నించారు. చేనేత నాయకునిగా తాను ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా 2014, 2019లో పోటీ చేశానని మళ్లీ మూడో సారి 2024లో పోటీ చేస్తున్నానని తెలియజేశారు. 2009 లో సిపిఐ తరపున కురుబ సామాజిక వర్గానికి చెందిన జగదీష్ పోటీ చేస్తే ఆయన్ను ఓడించారన్నారు. ఇప్పుడు ఎక్కడి నుంచో వచ్చిన బిజెపి అభ్యర్థి సత్యకుమార్‌పై కొందరు అత్యుత్సాహం చూపి మద్దతు ప్రకటిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానికున్ని, చేనేత వర్గానికి చెందిన తనను

విలేకరులతో మాట్లాడుతున్న రంగన అశ్వర్థ నారాయణ

ఆదరించకపోగా చిన్నచూపు చూపడం ఎంతవరకు సమంజసం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ సత్తా చాటుతుందన్నారు. బిజెపి అభ్యర్థి అఫిడవిట్లో తన సతీమణి పేరును ఎందుకు పొందపరచ లేదో ఒకసారి అందరూ ఆలోచన చేయాలన్నారు. ఇప్పటికైనా ధర్మవరం నియోజకవర్గంలో అధిక ఓటర్లు ఉన్న చేనేతలు ఇతరుల పల్లకీలు మోయడం మాని చేనేత వర్గానికి చెందిన తనను కాంగ్రెస్ పార్టీ తరపున గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా, సిపిఐ నాయకులు ముసుగు మధు పాల్గొన్నారు.

జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితం చేస్తాం

విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

2019 ఎన్నికల సందర్భంగా నవరత్నాలలు పేరుతో దాదాపు 730 హామిలను ఇచ్చి మాట తప్పిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితం చేస్తాం అని కూటమి నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బాలయ్య నివాసం వద్ద టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులు జగన్‌పై రూపొందించిన ఛార్జ్ షీట్ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం విలేకరుల సమావేశం టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ కుమార్, జనసేన నాయకులు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచక పాలన అంతం చేయడమే కూటమి పంతం అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని వర్గాలను అణగదొక్కారన్నారు. గొడ్డలి వేటు, కోడీ కత్తి పోయ ఇప్పుడు గులకరాయి

సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

నాటకాలను ఆడుతున్న కపటనాటక సూత్రధారి జగన్ అన్నారు. ఇలాంటి వ్యక్తికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్, ఐటీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు రామాంజనేయులు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి సునీల్, అమీన్, బాబా ఫక్రుద్దీన్‌తో పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరిక

ధర్మవరం టౌన్ : మండలంలోని ముచ్చురామి గ్రామానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు శుక్రవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరారు. సుధీర్‌రెడ్డి, బిల్లే మురళి(వాలంటీర్), హరీష్, భాస్కర్, అదిశేషు, వెంకటరెడ్డి, కృష్ణ మండల టీడీపీ నాయకులు భీమినేని విజయసారథి చౌదరి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.

చిలమత్తూరు : మండలంలోని పలువురు ముస్లిం మైనారిటీలు టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు యాదవ్, మండల కన్వీనర్ రంగారెడ్డి, లక్ష్మీనారాయణయాదవ్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. మైనారిటీల అభివృద్ధి టీడిపితోనే సాధ్యమని నాయకులు అన్నారు. తమకు టిడిపి అంటే ఎంతో అభిమానమని అయితే నాగరాజు యాదవ్ వ్యక్తిగతంగా తమ అభివృద్ధికి పని చేశారని తాము వైసిపికి పని చేశామని ఖాజాసాబ్ సౌకత్‌అలీ, కె.చాంద్ బాషా, సౌండా కలీముల్లా అన్నారు. నాగరాజు యాదవ్ టిడిపిలోకి వెళ్లడంతో తామంతా ఆపార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో అంజనప్ప, రంగారెడ్డి, నాగరాజు యాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, సురేంద్రయాదవ్, నందీశప్ప, రామాంజి, గంగప్ప, ఆటో ఖలీముల్లా పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం కదిరి కుంట్లపల్లికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టిడిపిలో చేరారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బి.రామచంద్ర రెడ్డి, కె.గోపీనాథ్ రెడ్డి, పి.శివ ప్రసాద్, పి.రామచంద్ర, చెన్నప్ప తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చెన్నకేశవలు, మాజీ ఎంపీపీ చక్రవర్దన్ రెడ్డి, పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి అర్బన్ : నల్లమాడ మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని మసకవంకపల్లి, మూలప్ప గారి పల్లి పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకురాళ్లు పాల్గొన్నారు.

టిడిపిని ఆదరించండి

ఓబుళదేవరచెరువు : ఎన్నికలలో తెలుగుదేశాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కొండకమర్ల టిడిపి , జనసేన నాయకులు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని కొండకమర్ల పంచాయతీ పరిధిలో ఉన్న మురికినీళ్ళవంక తండా, కొత్తపల్లి,ఓబులరెడ్డి గ్రామాల్లో కొండకమర్ల తెలుగుదేశం పార్టీ యువనాయకులు ఎద్దుల ప్రమోద్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు షఫీ, జాకీర్, సర్పంచి రేణుక బాయ్, జయచంద్రారెడ్డి, బాలకృష్ణ రెడ్డి, జనసేన నాయకులు సతీష్ కొండబోయన, కేశవ్, చంద్ర పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల ప్రచారం

పుట్టపర్తి క్రైమ్ : నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని చిత్రావతి రహదారిలో ఉన్న 6, 7 వార్డుల్లో రామ్, లక్ష్మణ్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ, కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న నగదుతో వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం

రూ. 1.7 లక్షల నగదు స్వాధీనం

ధర్మవరం టౌన్ : ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.1.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎర్రగుంట్ల సర్కిల్లో తనతోపాటు ఎస్ఐ శ్రీనివాస్, ఎఎస్ఐ బాషా, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన నల్లపరెడ్డి రూ.1లక్ష, నంద్యాల జిల్లా కలువపట్ల గ్రామానికి చెందిన బాలకంభన్నలు రూ.70వేలు ఎటువంటి బిల్లులు లేకుండా వాహనంలో తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్ధేశించిన విలువకు మించి డబ్బులు రవాణ చేయరాదని సిఐ తెలిపారు.

సజావుగా నామినేషన్ల పరిశీలన

పుట్టపర్తి రూరల్ : నామినేషన్ల పరిశీలన ప్రక్రియను శుక్రవారం స్థానిక ఆర్ఒ కార్యాలయంలో అధికారులు సజావుగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ పల్లె రఘునాథ్ రెడ్డి, పల్లె కృష్ణ కిషోర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి దాదిరెడ్డి శాలిని, వైసిపి దుద్దుకుంట కిషన్ రెడ్డి నామినేషన్లు తిరస్కరణకు గురి అయ్యాయి. వీరికి పార్టీ బీఫార్మ్ లేని కారణంగా తిరస్కరణ గురైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే అభ్యర్థులుగా 39 మంది నామినేషన్లు వేయగా వాటిలో 27 మంది అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించారు. 39 నామినేషన్లకు గాను 28 చెల్లుబాటు కాగా 11 తిరస్కరణకు గురి అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తహాశీల్దార్లు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో 3 నామినేషన్లు తిరస్కరణ

ధర్మవరం టౌన్ : ధర్మవరం శాసనసభ అభ్యర్థిత్వానికి దాఖలు చేసిన నామినేషన్లను అధికారులు శుక్రవారం పరిశీలించారు. ధర్మవరంలో 26నామినేషన్లు దాఖలు కాగా వివిధ కారణాల వల్ల 3నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఎన్నికలు రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి తెలిపారు. ఇందులో బీజేపీ తరపున అంబటిసతీష్ కుమార్, ఆన్‌ఇండియా కిసాన జనతాపార్టీ గట్టు చైతన్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ వీర నారాయణస్వామిల నామినేషన్లను తిరస్కరించారు.

ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

హిందూపురం : సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు అనుభక్ కుమార్ సూచించారు. శుక్రవారం మడకశిర, హిందూపురం రిటర్నింగ్ కార్యాలయాల్లో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఒ కార్యాలయంలో వివిధ విభాగాలను పరిశీలన చేశారు. సంబంధిత అధికారులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విషయాలపై పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, తహశీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన గ్రామ వాలంటీర్

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం బీరేపల్లి పంచాయతీ పరిధిలోని చిన్నగుడ్డంపల్లి గ్రామ వాలంటీర్ సుకన్య శ్రీనివాసులు బాలయ్య సమక్షంలో టిడిపిలో చేరారు. ఈమెకు కండువా కప్పి బాలకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుకన్య శ్రీనివాసులు మాట్లాడుతూ హిందూపురం ప్రాంతం బాలయ్యతోనే అభివృద్ధి జరుగుతుందని తెలిసి పార్టీలోకి చేరానన్నారు. కార్యక్రమంలో ఐటిడిపి పార్లమెంట్ అధ్యక్షులు రామాంజనేయులు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, బీరేపల్లి నాయకులు, పాల్గొన్నారు.

బాలయ్య సమక్షంలో పార్టీలోకి చేరిన గ్రామ వాలంటీర్